


"ఎవరది"

ఉలిక్కిపడింది కుసుమ. ఒళ్ళంతా చెమటపట్టినయి. ఊపిరాడనట్టు అనిపించింది. బొంగురుగా వినిపించిన ఆ గొంతుక ఎవరిదో తను ఎవరని చెప్పడం. టక్ టక్ మునివ్రేళ్ళతో మరోమారు శబ్దం చేసింది.

"వస్తున్నాం."

ఒక్కక్షణం ఊపిరిబిగబట్టింది. తలుపు గడియ తీస్తున్న చప్పుడు. కుసుమ చేతి వ్రేళ్ళు పైట కొంగుమిద గట్టిగా బిగుసుకున్నాయి. తలుపు తెరుచుకుంది. ఒక్కసారిగా జిగేలుమనే లైటు వెలుతురు కుసుమ కళ్ళలో పడింది. ఆ వెలుతురు భరించలేనట్లు ఎదురుపడ్డ ఆ మనిషిని ఒక్కసారిగా చూడలేనట్లు ఒక్కక్షణం కళ్ళు మూసుకొని కాస్త ప్రక్కకు జరిగింది కుసుమ వెలుగులోంచి.

గడపలో నుంచున్న ఆడమనిషిని చూసి అతను ఒకడుగు వెనక్కి వేశాడు. అతడి కళ్ళలో ఆశ్చర్యం. అనుమానం. కుతూహలం.

"ఎవరోయ్ అక్కడ" గుంపులోంచి ఓ కేక.

"ఎవరండీ మీరు?" ఎంతో ప్రయత్నం మీద ఆ మాటలు అన్నట్టుంది అతడిని చూస్తే. అతడి భుజంమీదుగా లోపల కనపడుతున్న టేబిల్ కేసి, చుట్టూ కూచునివున్న గుంపుకేసి కళ్ళు చిట్లించి చూసింది కుసుమ. మరుక్షణం కళ్ళు తిప్పుకుంది.

"ఎక్స్‌క్యూజ్‌మి. హరిగారున్నారా?" ఎంత ప్రయత్నం చేసినా అణుచుకోలేని వణుకు.

"హ....రి....ఏ హరి" అనుమానంగా సాలోచనగా ఆమెకేసి చూశాడు.

నాలుక కొరుక్కుంది కుసుమ. ఆ రెండక్షరాల పిలుపు తనకు మాత్రమే పరిమితం.

"అయాం సారీ. అదె కృష్ణగారు హరికృష్ణగారండీ" తొట్రుపాటుగా అంది.

"ఎస్. ఎస్. యింతకూ మీ రెవరు...." అతని మాట పూర్తికానె లేదు.

"ఎవరోయ్ అక్కడ. తలుపు తెరవడానికి వెళ్ళిన వాడివి అక్కడే అతుక్కుపోయావు. నా పేరు కలవరిస్తున్నావెమిటి?" కొద్దిగా నవ్వుతూ, కాస్త ఊగుతూ అక్కడికి వచ్చిన హరికృష్ణ తలుపు కేసి చూశాడు. మరుక్షణం అతని పెదవుల మీది నవ్వు ఆగిపోయింది. మనిషి నిటారుగా అయ్యాడు. విచ్చుకున్న అతడి కళ్ళలో ఆశ్చర్యం. వెనువెంట కోపం.

"కుసుమా" అది గావుకేక.

"నీవు.... నీవు.... యిక్కడికి...."

"రాక తప్పలేదు" నిబ్బరంగా అంది కుసుమ.

"ఇంత రాత్రివేళ.... ఒంటరిగా .... మతిపోయిందా" అదుపులో పెట్టుకోవాలనుకున్న కోపం వ్యర్థప్రయత్నమయింది.

"ఇంతవరకూ పోలేదు హరి. ఇక మీదట వుంటుందా, పోతుందా అన్నది నిదయ" సూటిగా అతడి కళ్ళల్లోకి చూసింది. ముందురాత్రి డ్యూటీ అంటూ వెళ్ళిన మనిషి ఆ పగలంతా, రాత్రికి కూడా భోజనానికి రాకపోయినా ఆకలికి పడలినట్లుగా మాత్రంలేదు ఆ ముఖం. కొంచె

---

*ఎంత గొప్ప ప్రేమయినా అది ఏొకదశలో ఆగిపోతుంది. ఆ పైన బాధ్యత పైనబడుతుంది. బాధ్యతను నిరాకరిస్తే. ఒకనాటి సర్వస్వమయిన ప్రేమనే త్యజించవలసొస్తుంది మరి, తమ గమ్యం చేరుకొవడానికి.*

మయినా అలసట కనిపించటంలేదు ఆకళ్లలో. ఫ్రెష్‌గా కళకళలాడుతోంది. ఇప్పుడే టాయిలెట్ అయి. డ్రస్‌చేసుకుని బయలుదేరినట్లుగా వున్నాడు. ముదురు నీలం స్ట్రెచ్‌లాన్ ప్యాంటుమీద లేత నీలం షర్టు టక్ చేయబడి వుంది. వుంగరాలు తిరిగిన క్రాపు కొద్దిగా రేగి తెల్లని అతని నుదుటిపైన పడుతోంది. ఎప్పుడూ నవ్వుతున్నట్టే వుండే ఆ కళ్ళు.... ఆ కళ్ళు .... అవిచూసి... అవిచూసే తను....

"కుసుమా! వాట్ నాన్‌సెన్స్ యూ ఆర్ టాకింగ్? నీవు ఎక్కడకి వచ్చావో ఇది ఎటువంటి వేళనీ తెలిసే వచ్చావా? తెలివిలోనే వున్నావా అసలు."

"ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మి హరీ ఎక్కడక వచ్చానో. ఏ వేళలో వచ్చానో కాదు నీవడగవలసింది. నీవు అడగకపోయినా నేను చెప్పక తప్పదు. నిన్ను తీసుకువెళ్ళడానికి వచ్చాను. తక్షణం నీవు నాతో బయలుదేరి రావాలి హరీ." ఆజ్ఞాపించినట్టుగా అంది.

"కుసుమా...." కోపంగా అరిచాడు. చటుక్కున ప్రక్కకు తిరిగి చూశాడు. అప్పటిదాకా ఇద్దరికేసీ ఆశ్చర్యంగా చూస్తుండిపోయిన ఆ ఫ్రెండ్ హరి తనకేసి చూసిన చూపు అర్థం చేసుకున్నాడు. వెనక్కుతిరిగి వెళ్ళి గుంపులో చేరుకున్నాడు.

"ఇంటికి వెళ్ళు తరువాత మాట్లాడుతాను" కోపం. ఉద్రేకం. బిగబట్టుకుంటున్నట్టుగా అన్నాడు.

"హరీ...." ఏదో చెప్పబోయింది.

"కుసుమా సిగ్గులేక ఇక్కడికి వచ్చింది చాలక యింకా మాట్లాడుతున్నావా. ఛీ ఛీ. నీవు యిక్కడికి రావడం నాకెంత నామర్దాగా వుందో...." పళ్ళు బిగబట్టుకున్నాడు.

"నీవేమయినా అను. అవన్నీ తరువాత. వెంటనే నీవు యింటికి రావాలి. హరీ! పాపకు చాలా సీరియస్‌గా వుంది. నాకు భయంగా వుంది. వెంటనే డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాలి. ఇంట్లో కూడా ఎవరూ లేరు. ఆ పసివాడిని నిద్రలేపి పాప దగ్గర కూచోబెట్టి...."

ఇక మాట్లాడ నివ్వకుండా గుండెలోంచి ఏడుపు తన్నుకు వచ్చింది కుసుమకు పైట చెరుగు నోటికి అడ్డంగా పెట్టుకుంది శబ్దం బయటికి రాకుండా.

ఒకసారి వెనక్కు తిరిగి టేబిల్‌కేసి చూశాడు హరికృష్ణ. అందరి కళ్ళూ తమ వేపే కుతూహలంగా చూస్తున్నాయి.

"హరీ...."

"ఐసే గెట్ అవే ఫ్రం హియర్ ఫస్ట్"

"నేను వెళ్ళను. నీవు రావాలి. యిప్పుడే యీ క్షణం. నాతోటే. యు మస్ట్ కం" మొండిగా అంది కుసుమ.

"ఛీ వొక ఆడదానివేనా. గద్దల్లాగ ఎలా చూస్తున్నారో చూడు వాళ్ళు. దయచేసి యిక్కడొక సీన్ క్రియేట్ చేయొద్దు. నీవు వెళ్ళు. నేను వచ్చేస్తాను." ఇక మాటలు అనవసరం అన్నట్టు గిరుక్కున వెనక్కు తిరిగాడు. హరికృష్ణ.

"హరి. నాతో రా. ప్లీజ్. చాలా చీకటిగా వుంది." దీనంగా అంది. కారిన కన్నీళ్ళతో పాటు ధైర్యమూజారిపోయింది కుసుమలో.

"భయమా. నీకా. తమాషా చేయక వెళ్ళు. ఎప్పుడు వేయలేదూ భయం." యిక మాటలు పెంచటం యిష్టంలేక పెద్ద పెద్ద అంగలు వేస్తూ మిత్ర బృందాన్ని చేరుకున్నాడు.

"వాట్ కృష్ణా! ఆవిడ మి మిసెస్‌యేనా. ఏంటోయ్ కథ. నిన్ను లాక్కువెళ్ళడానికి వచ్చినట్టుగా వున్నారు?"

"అంతేనోయ్ యిప్పటి ఆడవాళ్ళు. మన పరువు తీసేస్తున్నారనుకో. ఇక్కడికి రాగలరు అక్కడికి రాలేరులే అన్న నిర్భయం లేదు మనకి. ఏ క్షణాన ఎక్కడయినా సరే చటుక్కున ప్రత్యక్షమయిపోయి జుట్టు పట్టుకొని మరీ లాక్కుని...."

"స్టాప్ విత్ దట్ మూర్తీ!" గట్టిగా అరిచాడు హరికృష్ణ. స్నేహితుల ముందు అలాంటి చోటికి. ఆ వేళప్పుడు కుసుమ రావడం. తను వెళ్ళిపొమ్మంటున్నా మొండికేసి మాటలు పెంచడం.... అవమానంతో అతని హృదయం క్షతకుతవుడుకుతోంది.

"ముక్కలు పంచవోయ్" అన్నాడు మనసు బిగబట్టి.

"నీవు వెళ్ళాలేమో. ఆవిడేమో నిన్ను వున్నపళాన బయలుదేరమని...."

"ఐ నో మై నెసెసిటీ. ఆట మొదలు పెట్టొచ్చు."

మరుక్షణం ఆటలో మునిగిపోయాడు సీరియస్‌గా హరికృష్ణ.

కుసుమ కాళ్ళు తడబడుతున్నాయి. ఇంటిదగ్గర ఎలావుందో ఏమిటో. వస్తున్నపుడుంటిన మొండిధైర్యం ఇప్పుడు లేదు గేటు ఎక్కి ఇవతలకి దిగాలంటే పాదాలు వణికాయి. కాంపౌండ్ బయటకి వచ్చి నిలుచుని ఒక నిమిషం ఆగి వెనక్కు తిరిగి చూసింది ఆశగా. హరి వస్తున్న జాడ


రంజాన్ పర్వదినం, మరపురాని మధురక్షణం
అందమైన పండుగనాడు ఆనందోత్సాహములను వెదజల్లె
విమల్ వారి వస్త్రసంపదలో షూటింగులు, షర్టింగులు
డ్రెస్ ఫ్రాబిక్సులు, శారీస్‌లు గణనీయమైన
స్టాకులో నుండి ఎన్నుకొనండి-

VIMAL
A RELIANCE PRODUCT

విమల్ షోరూం ఆరాధన
కొత్తగూడెం.

ఆఖరు తేదీ మించిపోతోంది!

* మీ పన్ను రిటర్నులు పంపేందుకు త్వరపడండి.
* రిటర్ను పంపే ముందు, సెల్ఫ్ అసెస్‌మెంట్ పన్ను చెల్లించాలని గుర్తుంచుకోండి.

జారీ చేసినవారు :
డైరెక్టర్ ఆఫ్ ఇన్స్‌పెక్షన్
(రిసర్చ్, స్టాటిస్టిక్స్ & పబ్లికేషన్)
ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్
న్యూఢిల్లీ-110 001.

davp 78/142

**RALLI-MIX Deluxe.**



ఇండియాలో కెల్ల అత్యంత శక్తివంతమైన మోటారుగల

రాలి మిక్సి

డీలర్లు : స్టోన్ విజన్
ఏలూరురోడ్డు, విజయవాడ-2

Suvarna

"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

ఉచితము ఉచితము ఉచితము

## తెల్ల మచ్చలు

మా వైద్యము ద్వారా తెల్లమచ్చ రంగు సమూలంగా త్వరితగతిని మామూలుగా మార్చును. మా వైద్యము ఎంత సఫల మైనదో పరీక్షచేసి చూడండి. రోగ వివరములు మాకు వ్రాసి ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా తెప్పించుకోండి.

## తెల్ల వెంట్రుకలు

పొగద్త కాదు, మా ఆయుర్వేద తైలము వాడుటవలన వెంట్రుకలు తెల్లబడుట ఆగిపోయి సమూలంగా నల్లగా మార్చును. ఈ తైలము మెదడు మరియు కండ్ల బలహీనతలకు లాభదాయకమైనది. వేలమంది ప్రజలు దీనిని వాడి, లాభము పొంది యున్నారు ఒక సీసా వెల రు. 10/– 3 సీసాల వెల రు. 28/–పోస్టేజి అదనం

MRITYUNJAY SUDHA
OWSHADHALAYA,
(A.J) (P.o) Katrisari (Gaya)

లేదు. దుఃఖం తన్నుకు వచ్చింది. "పాప ఎలా వుందో" గుండెలు గబగబా కొట్టుకున్నాయి.

"బాబు నిద్రపోయాడో ఏమో" చుట్టూ చీకటి. నిర్మానుష్యం. తనున్న పరిస్థితికి తనమీగ తనకే జాలివేసింది. గబగబా అడుగులు వేసింది ముందుకు. ఇల్లు చేరుకుని వీధి తలుపు తాళం తీయబోతూ ఆత్రుతగా కటకటాల గుండా లోపలికి చూసింది. కుసుమ కళ్ళు ప్రవాహాలయ్యాయి. కడుపులో దేవినట్లయింది. పాప విపరీతంగా ఆయాసపడుతోంది. పొట్ట ఎగిరి ఎగిరి పడతోంది. ఇవేవీ గమనించ లేని పసితనం. ముంచుకు వస్తున్న నిద్రకు తట్టుకోలేక నేలమీదనే ఒక ప్రక్కకు ఒరిగిపోయి ముడుచుకుని పడుకుని నిద్రపోతున్నాడు బాబు.

"పాపా".... "పాపా" తట్టింది వీపు మీద పొట్టమీద. వుండుండి కళ్ళు తేలవేస్తోంది పసిది. పొంగి వస్తున్న ఏడుపును అతి ప్రయత్నం మీద బిగబట్టింది కుసుమ. బిడ్డను చేతులలోకి తీసుకుంది. "పాపా" గట్టిగా రొమ్ములకేసి అదుముకుంది. చిప్పిన రొమ్ముల్లో పాలు చిమ్మాయి. నీళ్ళతో నిండిన కళ్ళకు మసగ్గా వుంది. రెప్పలు తాటించింది. బుగ్గల మీదుగా జారాయి నీళ్ళు. గుండెల మీదున్న పైట తీసి ఆ నీళ్ళను అద్దింది కుసుమ. చిమ్మిన పాలను పీలుకున్న ఆ పైట ఆ కన్నీళ్ళను కూడా సమంగానే పీల్చుకుంది.

"ఒకసారి చూడమ్మా పాపా, నాకేసి ఒకసారిలా చూడు. 'అమ్మా' అనమ్మా బుజ్జీ ఒకసారిలా చూసి అమ్మా అను" పిచ్చెత్తినదానిలా ఏదో ఆవేశం కుసుమలో బిడ్డని చేతుల్లోకి తీసుకుని వూగిస్తోంది.

మరుక్షణం ముందుకు కదలింది కుసుమ చుట్టూ పేరుకుని వున్న చీకటిగానీ, ఒంటరితనంగానీ తన మనసులో ఏ విధమైన సంచలనం కలిగించలేకపోయాయి.

గబగబా క్వార్టర్సు దాటుకుని, రైల్వే లైన్లు దాటుకుని స్టేషన్ చేరుకుంది. ఎక్కడికి వెళ్ళడం? తనకెవరూ తెలీదు. వెళ్ళాలి. ఎక్కడో ఒక చోటుకి వెళ్ళాలి తక్షణం. రిక్షా పిలిచి ఎక్కికూచుంది.

"చూడు బాబూ. ఎవరయినాసరే. వెంటనే దగ్గర్లోవున్న డాక్టరు దగ్గరకు తీసుకుపో. పాప ప్రాణాలు........" ఏడుపు బయటకి రాకుండా కొంగు నోట్లో కుక్కుకుంది. ఆ ఒక్కముక్కలో ఆమె దయనీయస్థితి ఆ రిక్షావాడు అర్థం చేసుకున్నాడు. డాక్టరు యింటిముందు దించి ఆమె చేతుల్లోంచి పాపను తీసుకున్నాడు. ఒక్క అంగలో గేటు తీసుకుని లోపలికి వెళ్ళి గబగబా తలుపులు బాదింది కుసుమ. చదువుతో వచ్చిన సంస్కారంగానీ, నాగరికత నేర్పిన సభ్యతగానీ ఆమెలో లేవు ఆ క్షణాన.

"ఎవరది" తలుపులు తెరిచాడు డాక్టరు. మరుక్షణం ఆ రెండు కాళ్ళనూ చుట్టేసి బావురుమంది కుసుమ.

ఎంతో విసుక్కుంటూ నిద్రలేచి వచ్చిన డాక్టరు మత్తు వదిలిపోయింది.

పాపను పరీక్ష చేస్తున్న డాక్టరు ముఖంలోకి ఆత్రుతగా, ఆవేదనగా పిచ్చిదానిలా చూస్తోంది కుసుమ.

'ఏమయినా జరిగితే ఈ తల్లి ఏమవుతుంది' అనుకుంటూ చూస్తున్నాడు కుసుమకేసి రిక్షావాడు.

"అయామ్ సారీ మేడమ్. అయిపోయింది. ఒక అరగంట ముందయినా మీరు తీసుకురాగలిగి వుంటే పాప ప్రాణం నిలిచేది" చెప్పలేక చెప్పాడు డాక్టరు.

కుసుమ గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలయినట్టు వుంది. తను వింటున్నదేదో నమ్మలేనట్టు.... 'లేదా పాపలేదా యింక' ఆ తల్లి కడుపులో పేగులు కదిలిపోయాయి.

"డాక్టరుగారూ" కాళ్ళు పండూ తన చేతులతో గట్టిగా చుట్టేసింది.

'మీకు పుణ్య ముంటుంది డాక్టర్. నా పాపను బ్రతికించండి. ఏ మూలో వూపిరి వుంటుంది. సరిగా చూడండి డాక్టర్. నా కడుపులో చిచ్చు పెట్టకండి" కన్నీళ్ళతో అతడి పాదాలు తడిసిపోయాయి. రిక్షావాడు తుండుతో కళ్ళు అద్దుకున్నాడు భుజాలు పట్టుకుని కుసుమను లేవదీశాడు డాక్టరు.

"చూడమ్మా. నేను డాక్టరునే కాని దేవుడిని కాను. నీవు చదువుకున్న దానిలాగే వున్నావు. అర్థంచేసుకో. ఏమాత్రం కొనవూపిరి వున్నా ఆ వూపిరికి వూపిరులు వూది బ్రతికిస్తారే గానీ డాక్టర్లు కడుపులో చిచ్చులు రగిలించరు. బాధపడకు. ఇంత ఆలస్యం చేయకుండా కనీసం ఒకే ఒక్క అరగంట ముందు పాపను నీవు తీసుకురాగలిగి వుంటే నీ పాపను నీకు దక్కించేవాడిని. ఇంక లాభంలేదు వెళ్ళమ్మా."

కుసుమ ముఖం చూడలేనట్టు పక్కకు తిరిగాడు డాక్టరు.

రిక్షావాడు పాపను ఎత్తుకున్నాడు. కుసుమ వంక ఒకసారి చూసి "పదమ్మా" అన్నాడు. కట్టెలా బిగుసుకున్న పాపను గుండెలకు హత్తుకుని కూచుంది కుసుమ. రిక్షా బయలుదేరింది. కుసుమ కడుపులో చేతులువేసి దేవినట్టుగా వుంది. వుండలు చుట్టుకు పోతోంది గొంతులో దుఃఖం బయటకి రాలేక.

రిక్షా ఇంటిముందు ఆగగానే తొంగి చూసింది కుసుమ. ఆ కళ్ళకు నిరాశ ఎదురయింది

"భగవంతుడు ఆ పసిబిడ్డని తీసుకుపోయాడు. మన చేతుల్లో ఏంలేదు. మనసు పాడుచేసుకోకు తల్లి" అంటూ వెళ్ళిపోయాడు రిక్షా అతను.

ఆనాడు.... అతడి రూంలో....

"హరి, నీతో పెళ్ళికి మా ఇంట్లో ఎవరూ ఇష్టపడటంలేదు. నిన్ను తప్ప నేను మరెవరినీ భర్తగా అంగీకరించలేను" అతడి గుండెలో ఒదిగిపోయి అంది తను.

"కుసుమ! మా ఇంట్లో మాత్రం ఒప్పుకుంటారనుకున్నావా. కట్న కానుకల ఆశ గురించికాదు మనమధ్య కులమనే గోడ వుంది కూడా

"మరెలా" జాలిగా చూసింది అతని కళ్ళల్లోకి.

"పిచ్చి కుసుమ్. నాకు నీవు కావాలి. అందుకోసం నేనేమయినా చేయగలను" దృఢంగా అన్నాడు.

"హరి! నీవు చేయి అందివ్వాలేగానీ, ఆచేయి పట్టుకొని నీతో మృత్యుముఖంలోకయినా రావడానికి నేను సిద్ధం." అతడి భుజాల చుట్టూ తన చేతులు పెనవేసి ఆ భుజాల మీదుగా తల వాల్చుకుని నిశ్చయంగా అంది.

"కుసుమ్ బాగా ఆలోచించుకో. మీ వాళ్ళందరినీ వదులుకుని రావాల్సివుంటుంది. మా వాళ్ళు సమాధానపడినా నీకు తగిన ఆదరణ యిస్తారని నాకు నమ్మకం లేదు. నీ కెవ్వరూ వుండరు"

"హరి! నీవు నేనున్నాను కుసుమా అని ధైర్యం చెప్పవలసిన నీవేనా యీ మాటలు అనేది. నీవు లేనపుడు నాకు ఎందరున్నా లేనట్టే నీ లోటు నేను భరించలేను" అంతే కన్నీళ్ళు, అభ్యర్థనలు, ఆజ్ఞాపనలు దౌర్జన్యం. బెదిరింపులు యివేవీ తనను కట్టడిచేయలేకపోయాయి. కట్టుబట్టలతో గడపదాటి వచ్చి హరిచేతిలో చేయి వేసింది తను.

రైల్వేలో వుద్యోగం. చిన్న క్వార్టరు. కుసుమకు హరి. హరికి కుసుమ! మరెవరూ లేరు. అయితేనేం ఎంత హాయిగా. మరెంతో తీయగా తమ కోరికలు. ఆశలు కలబోసుకుంటూ, తీర్చుకుంటూ ఎంత మధురమైన జీవితం గడిపారు!

"నేనూ వున్నాను. అంటూ బాబు పుట్టినపుడు యిద్దరూ పొందిన అనుభూతి ....

"కుసుమ్, చూశావా నాకు నీవు, నీకు నేను తప్ప మనకు ఎవ్వరూ లేరు హరీ అనేదానివి. యిప్పుడు మనిద్దరికీ కలిపి బాబు వున్నాడు. పై ఏడాది ఓ చిన్న పాప .... ఆ పై ఏడాది....

"ఫుల్ స్టాప్" అంది తను నవ్వుతూ.

"అంతటితో ఆపకుంటే అదే మహాభారం—సంసారం" అంటూ పాట అందుకుంది తను. ముద్దువెళ్ళతో నెత్తిన మొట్టాడు హరి.

అన్నట్టే పాప పుట్టాక ఆపరేషన్ చేయించుకుంది.


మరో ప్రపంచమే అక్కరలేదనుకున్న కుసుమ అమృతమయమైన సంసారంలో విషబిందువులు చిలికాయి.

హరికృష్ణకు స్నేహితులు పెరిగారు. నైట్ డ్యూటీలకు వెళ్ళడంతో ఆ స్నేహితులతో కలసి కొన్ని అలవాట్లు చేసుకోవలసి వచ్చింది. అయినా అవేవీ చాలా రోజుల వరకు బాధ కలిగించలేదు. సరదా, కాలక్షేపం అనుకున్నవి కాస్తా వ్యసనాలుగా మారేసరికి కుసుమకు దిగులు పట్టుకుంది. బాగా వంటబట్టిన పేకాటలో పడితే మరేం కనబడ్డంలేదు హరికి. కుసుమ మంచిగా ఎంతో చెప్పి చూసింది. డ్యూటీకి, తప్పితే పేకాటకు వెళ్ళిపోవడంతో అతను యింట్లో వుండడమే బాగా తగ్గిపోయింది భరించలేక పోయింది కుసుమ. చివరకు తమ యింట్లోనే ఆడుకునేలా ఒప్పించింది అతడిని. పగలు డ్యూటీ అయితే రాత్రిళ్ళు. రాత్రి డ్యూటీ వుండే పగలూ ఆ యింట్లో పేక జోరుగా సాగింది కొన్నాళ్ళు. ఇంటి పనులతో పాటు బజారు పనులు కూడా చూసుకోవాల్సివచ్చింది కుసుమకు. అయినా సరే హరి తన కళ్ళముందే వుంటున్నాడు అనే తృప్తి అతని చేతుల్లో యిమిడిపోయిన కొన్ని క్షణాలలో నూ అతని అపరాధాలన్నిటిని మన్నించేసేది. పోనీలే ఆయనకి మాత్రం ఎవరున్నారు. అందరూ వుండీ లేని వాడయ్యారు. బంధువులు, రాకపోకలు, పెళ్ళిళ్ళు, పిలుపులు ఏవీ లేవు తమకు. తనంటే ఆడది. కాని మగవాడికి కాస్త రిలీఫ్ వుండాలి అనుకుని జాలిపడేది.

ఖాళీగా వున్న క్వార్టరు ఒకటి తీసుకున్నారని, నిరంతరం అక్కడ ఈ పేకాట యజ్ఞం జోరుగా సాగుతోందని తరవాత తెలిసింది కుసుమకు. రాత్రీ పగలూ డ్యూటీ

## ఆనందమార్గం

ఒక ఇంటావిడ దారినపోతున్న పనిమనిషిని ఎంకిని పిలిచి "ఏమే, అన్ని ఇళ్ళల్లో పని మానేసి ఆ ఒక్క ఇంట్లోనే చేస్తున్నావే! ఎంత జీతం ఇస్తున్నారేమిటి!" అని అడిగింది



దానికి ఎంకి "జీతం కోసం కాదమ్మోయ్! ఇదివరకు ఆ ఇంట్లో పనిచేసిన మనిషే ఇప్పుడు ఆ ఇంటి ఆయనకి భార్య, నేనూ అలా బాగు పడదామనే"....

ఒక హోటల్ యజమాని అప్పుడే హోటల్లోకి వచ్చిన తన కొడుకుతో "ఏరా! B. A ఎలాగో పాసయ్యావు. మరి ఏం ఉద్యోగం చేద్దామనుకుంటున్నావు" అని అడిగాడు.

అందుకు హోటల్ యజమాని కొడుకు "మూడు దోశ, నాలుగు ఇడ్లీ పార్సల్" అని అరుస్తూ లోపలికెళ్ళాడు

—యం. ఆర్. ప్రసాదు

REGD.
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs: SEENU & CO., MADRAS-21

లేని సైమంతా అక్కడే గడుపుతున్నాడు హరి. ఒక్కొక్కపూట భోజనానికయినా రాని అతనికోసం ఎంతో ఆవేదనా చెందింది కుసుమ. ఏ అర్ధరాత్రికో, తెల్లవారు ఝామునకో వచ్చే అతనిని చూసి ఏడ్చింది. ప్రతిమాలింది. కోపగించుకుంది. బెదిరించింది. చివరకు మనసు చంపుకుని అతడికి భోజనం మిగలకుండా చేసి అతడల్లే ఆకలితో పడుకుని నిద్రపోతే విలవిల లాడిపోయి కుమిలి కుమిలి ఏడ్చింది.

శతవిధాలా ప్రయత్నించి అతడికి విసుగు తెప్పించేదే కాని కుసుమ మార్చలేకపోయింది. ఓడిపోయింది. వదలిపెట్టింది. నిర్లిప్తంగా వుండిపోయింది. ఎప్పుడయినా రానీ, ఎప్పుడయినాపోనీ. ఏమన్నాచేయనీ. తన సర్వస్వం వదులుకొని అతడి కోసం వచ్చింది తను. తనకోసం అతడూ అలాగే వచ్చాడు. విధికి కన్ను కుట్టింది. ఏదో ఒకనాడు దారికి రాకపోడు. తన తప్పు తెలుసుకోలేకపోడు. వేచి చూడటం తప్ప తను చేయగలిగిందేమిటి?

కాని.... కాని మూడు రోజుల క్రితం. రాత్రి........

పాపకు జ్వరం వచ్చినటుంది. డాక్టరు దగ్గరకు తీసుకువెడదాం హరీ."

భోజనం చేసి డ్రస్ చేసుకుని బయలుదేరబోతున్న హరి చిరాగ్గా చూశాడు కుసుమ వేపు.

"ఇప్పుడా ఏదయినా గృహ వైద్యం చేసి చూడు. రేపు నాకు రెస్ట్ కదా. ఉదయమే చూద్దాం" చివరి మాట బూట్ల టకటకలో కలిసిపోయింది.

"హరీ, హరీ! చూశావా చూశావా ఎంత పని చేశావో పాప యింకలేదు. హరీ. కుసుమం లాంటి యీ కుసుం గుండె యీ క్షణాన కాలిపోతోంది. పసిబిడ్డను. చేతులారా పోగొట్టుకుని నా కడుపు కాలుతోంది హరీ. ఇప్పుడు యిక్కడున్నది నీకోసం తపించి, నీ కోసం సర్వస్వాన్ని వదులుకుని వచ్చిన మనసు కాదు. నీ నిర్లక్ష్యానికి బలయిపోయి బండ అయిపోయింది హరీ నా మనసు.

ఇక్కడే యిల్లే వుంటే నీ నిర్లక్ష్యానికి ఏదో ఒక రోజు పసూ దూరమయిపోతాడు. పిల్లలు పుట్టకుండానే వుండాలి. కానీ పుట్టి, పెరిగి ఆడి, పాడి మన ముందే పోవడమన్నంత నరకం మరొకటిలేదు. తండ్రిగా నీకా బాధ వుంటుందో లేదోనాకు తెలీదు గానీ కన్నతల్లిలా ఈ కడుపు కోత నేను బతికి వున్నంతవరకు భరించక తప్పదు. బాబుని కూడా పోగొట్టుకుంటే నేను బ్రతకలేను హరీ, వాడు నాకు కావాలి. నీకోసం వీడిని కూడా పోగొట్టుకుందుకు నేను సిద్ధపడలేను. నాకా గుండె నిబ్బరంలేదు నేను నా బాబుని పెంచుకోలేకుండా పోను. చేతులారా మాత్రం వాడిని చంపుకోలేను. మా బాదరబందీ నీకు వద్దు. ఇక నీవు యింటికి రావాలే అన్న బాధలేదు. ఎదురు చూసేవాళ్లు గానీ, రాలేదని అడిగి, విసిగించి, కోపం తెప్పించే వాళ్ళు గానీ వుండరు. రాత్రేకాదు పగలుకూడా ఆ వుద్యోగం మానేసి ఇరవైనాలుగు గంటలూ నీవు ఇక ఆడుకోవచ్చు హరి. నీవు పేకలతోనే కాదు జీవితాలతో కూడా ఆడుకున్నావని తెలుసుకోగలిగితే .... నా కోసం ప్రయత్నించవద్దు. నేను నీ ముఖం చూడలేను. నన్ను క్షమించు. చివరిసారిగా ఒక్కమాట హరీ మనసులోనూ, తనువులోనూ, ఆలోచనలలోనూ అణువణువులోనూ నిన్నే నింపుకున్న కుసుమ ఒక్కసారిగా తెంచుకుని ఎలా వెళ్ళగలిగింది అని ఏ మూలో నీ గుండెల్లో ప్రశ్న వుదయిస్తే అందుకు నా సమాధానం మనసు గాజు బొమ్మలాంటిది హరీ. ఏ క్షణాన చేయి జారుతుందో? ఎప్పుడు ముక్కలవుతుందో? విరిగిపోతే మాత్రం అతుకు పడదు. అంతే. నేను చెప్పగలిగింది. నీ కోసం నీ చేయి అందుకుని వచ్చిన కుసుమ ఈనాడు నీ నుంచి వెళ్ళిపోతున్నదంటే నా మనసు ఎంత విరిగిపోయిందో, ఎన్ని ముక్కలయిందో వూహించగలవు. ఇంతకన్నా నీకు చెప్పడానికి మరేం మిగలలేదు.

— కుసుమ

టేబిల్ మీదున్న పెళ్ళి ఫొటో దగ్గరగా వుత్తరం కనబడేలా పెట్టింది. స్థిర నిశ్చయంతో బాబు బట్టలు, తనబట్టలు సూట్‌కేసులో సర్దింది. మెయిల్‌కు స్టేషన్‌లో కొట్టిన గంట వినిపించింది. పాప శవాన్ని టవలులోకి చుట్టుకుని భుజంమీద వేసుకుని బాబుని తీసుకుని సూట్‌కేస్ పట్టుకుని బయటికి వచ్చింది కుసుమ. తాళం వేసి తాళంచెవి తలుపుపైన కటకటాల అంచుపై పెట్టింది. మరుక్షణం గిరుక్కున వెనక్కి తిరిగి స్టేషన్ వేపు గబగబా అడుగులు వేసింది. బాబును నడిపించుకుని. ఇంకో గంటలో తూర్పు తెల్లవారుతుంది. మరి కుసుమ జీవితం? భవిష్యత్తుమీద ఆశతో బయలుదేరింది కుసుమ - తనకు యింతవరకు అవసరం కలగని బయటి ప్రపంచం లోకి. ★


## నెరసిన జుట్టు

రంగువల్ల కాదు. మా 'కేశ రంజని' ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ నెరసిన జుట్టుకు మామూలు నల్లరంగు నిస్తుంది. పైగా అది మెదడుకు, కళ్ళకు మంచి టానిక్కు. ధర రు. 12/– సంతృప్తి శాశ్వత ఫలితానికి 3 సీసాల్స్ రు. 27/–

SHYAM AYURVED BHAVAN (S.5)
P. O. Katri Sarai (Gaya)

## రిస్ట్ వాచ్

ధర రు. 12/– లు మాత్రమే

17 జ్యూయల్స్ రిస్ట్‌వాచ్‌తో చైన్ సిస్టమ్ మరియు 5 సం.రాల గ్యారంటీ. రు. 12/–లకే లభ్యమగును. పోస్టేజి ప్యాకింగ్ ఛార్జీలు రు. 7-50 అదనం.

R WATCH Co (A.K)
P. o. Maira Berith
[PATNA] P.C-805105

ఉచితం ఉచితం ఉచితం

## తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషదం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును, అటుపైన మామూలు చర్మమువలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి.

JIWANKALYAN ASHRAM-8
P. O. KATRI SARAI (GAYA)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.

వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.

డా॥ దేవర, ఫోన్ 551
మార్వాడి గుళ్ళ ఎదుట, తెనాలి.

బ్రాంచి: 26, వార్తిబోగ్ రోడ్, మద్రాస్-17